# పతివ్రత

- రావినూతల సువర్ణకన్నన్



నేను కాపరానికొచ్చి వారం రోజులయిందో లేదో నేనో పతివ్రతని అన్న పేరొచ్చేసింది. రాదూ మరి? అసలే మాది పతివ్రతల వంశం. నేను ప్రతివతని, మా అమ్మ మహా పతివ్రత, మా బామ్మ మహా మహా పతివ్రత. పరాయి మగాడి ఎదుట నిల్చి మాట్లాడ్డమే తల కొట్టేసినట్టుంటుంది. నేను పల్లెటూళ్ళో పుట్టి పెరిగినా, పెద్దబాలశిక్ష తప్ప చదువుకోకపోయినా మా బామ్మ ధర్మమా అని నాకన్ని పురాణ గాథలూ తెలుసు. పతివ్రతల కథలూ తెలుసు. భర్తని ఎలా చూసుకోవాలో కూడా తెలుసు. అందుకే అందరి దృష్టిలోనూ నేను పతివ్రతనై - పోయాను. అయితే కుగ్రామమైన 'కలవగుంట' నుంచి ఒక్కసారిగా హైదరాబాద్ రావడంతో కాస్త కంగారుగా అనిపించిన మాట నిజం. అదేం కర్మోగానీ ఇక్కడ చాలామంది ఏ పాలిస్టర్ చీరో కట్టుకుని, ఓ జత బంగారు గాజులు, మెళ్ళో ఓ సన్నటి చైను తప్ప వేసుకోరు. అవును మరి! అందరికీ ఒంటెడునగలు చేయించుకునే తాహతు వుండొద్దూ! నాకైతే మా బామ్మ పట్టుపట్టి ఒంటెడు నగలు చేయించడమేగాక అవి రోజూ వేసుకుంటేనే గానీ వూరుకోదు. వడ్డాణం, కాసులపేరు, అరవంకీలు, చేతులనిండా గాజులు, చెవులకి రవ్వల జూకాలు పెట్టుకుని, ఎంచక్కా పట్టుఫరికిణీ కట్టుకుని తిరుగుతుంటే- "నా తల్లికి కిరీటం కూడా పెడితే వైకుంఠం నించి దిగి వచ్చిన ఆ లక్ష్మీ దేవిలాగే వుంటుంది"అంటూ మురిసిపోయేది బామ్మ.

"ఇంకా ఆలస్యం దేనికీ ఆ కిరీటం కూడా చేయిస్తే పోలా! ఏకంగా లక్ష్మీదేవే అని గుళ్ళో కూర్చోపెట్టచ్చు!" అనేది అమ్మ వ్యంగ్యంగా. ఆమెకి నగల మీద నాలా పెద్ద వ్యామోహం లేదు. నిజం చెప్పద్దూ...నాకూ ఓ కిరీటం చేయించుకోవాలనే వుండేది. కానీ అమ్మకి భయపడి నా కోరికని మనసులోనే దాచుకున్నాను.

నేను కాపురానికొచ్చేటప్పుడు నాతో పాటు బామ్మే వచ్చింది. అసలు మా అమ్మకంటే మా బామ్మంటేనే నాకెక్కువ ఇష్టం.

నేను సారెతో కారు దిగుతుంటే ఇరుగు పొరుగు వారు కళ్ళు ఇంతంత చేసుకుని మరీ చూశారు. మావారైతే నోట మాటరానట్టు అలా చూస్తుండిపోయారు కూడా. మరి నా అందం అలాంటిది! అయితే ఆయన అలా చూసింది నా అందాన్ని కాదనీ, నా అలంకరణనీ, అది ఆయనకి నచ్చలేదనీ తర్వాత తెలిసింది ఆ రాత్రి-

"ఏవిటి సరసూ! గంగిరెద్దులా ఆ నగలేమిటి, ఆ పట్టు చీరేవిటి?"అన్నారు కాస్త అనునయంగానే.

నేను విస్తుపోయాను.

"ఏవిటి ఇంత మంచి నగలు, పదివేల రూపాయల పట్టుచీర కట్టుకుంటే గంగిరెద్దులా వున్నానంటారా?" అన్నాను నిష్టూరంగా. ఆయన సర్దుకుని-

అబ్బే అదికాదు. కనీసం పడుకునేప్పుడైనా ఆ నగలు తీసెయ్యొచ్చు కదా...గుచ్చుకుంటాయి!"అన్నారు గోముగా.

"బావుందండీ, చిన్నప్పట్నించీ అలవాటైన నగలు తీసేస్తే నాకు తోచద్దూ? అయినా మీకు ఇంతింత మీసాలున్నాయి. అవి గుచ్చుకుంటాయి తీసెయ్యండి అని నేనన్నానా?"అంటూ కిసుక్కున నవ్వాను. ఇంక నోరెత్తలేదాయన.

అయిదింటికల్లా వెంకటేశ్వర సుప్రభాతం వినిపించి గభాల్న లేవబోతున్న నన్ను చుట్టేస్తూ-

"అప్పుడే ఎక్కడికి కాస్సేపు పడుకో సరసూ!" అన్నారు చిలిపిగా చూస్తూ.

"అయ్య బాబోయ్! అయిదయిపోయింది. బామ్మ సుప్రభాతం కేసెట్ పెట్టేసిందంటే ఇంక లేవమనే. మీరూ లేవండి!" అంటూ మంగళ సూత్రాలు కళ్ళకద్దుకుని, ఆయనగారి కాళ్ళకి నమస్కరించి బైటకొచ్చేశాను. అరగంటలో స్నానపానాలు పూర్తి చేసుకుని తలకోగుడ్డ చుట్టుకుని మళ్ళీ ఆయన గదిలోకెళ్ళాను. ఇంకా ఆయనగారు నిద్రావస్థలోనే వున్నారు. ఎలాగో ఆయన్ని లేపి బాత్‌రూమ్‌లోకి తోసి కిందకొచ్చాను.

"అమ్మాయ్! అబ్బాయికి అన్నీ సిద్ధం చేశావా?"

అంది బామ్మ వంటింట్లోంచే.

"అన్నీ రెడీగా వున్నాయి బామ్మా!" అన్నాను. మొహం తుడుచుకుంటూ వస్తున్న ఆయన మొహం వెలిగిపోయింది.

"గుడ్! అప్పుడే టిఫిన్ కూడా రెడీ చేసేశారన్నమాట! గుడ్!...ముందు ఓ కప్పు కఫీ ఇవ్వు, తర్వాత టిఫిన్ తిందాం'' అన్నారు ఉత్సాహంగా డైనింగ్ టేబుల్ ముందు కూర్చుంటూ.

"కాఫీనా? భలేవారే!...స్నానం చెయ్యకుండా కాఫీ ఏవిటండీ! ముందిలా వచ్చి కూర్చోండి''అంటూ అయోమయంగా చూస్తున్న ఆయన్ని తీసికెళ్ళి మావూరి నించి తెచ్చిన వెండి పూలున్న పీటమీద కూర్చోబెట్టాను.

"ఏవిటి? టిఫిన్ పీటమీద కూర్చుని తినాలా?'' అన్నారాయన బిక్క మొహం పెట్టి.

"కంగారు పడకండి. టిఫిన్ టేబిల్ మీదే తిందురుగానీ''అంటూ మావూరి నించి తెచ్చిందే పెద్ద ఇత్తడి పళ్ళెం. ఆయన ముందు పెట్టి- "ఇందులో కాళ్ళు పెట్టండి!''అన్నాను.

"ఎందుకు?'' మరింత బిత్తరపోయారాయన.

"అబ్బ! చెప్పింది చెయ్యండి!'' అంటూ బలవంతంగా ఆయన కాళ్ళు అందులో పెట్టి, చెంబుడు నీళ్ళతో పాదాలు కడిగి, రాత్రే తెప్పించి వుంచుకున్న పూలతో ఆయనకి పాదపూజ చేశాను. పాదజలం నెత్తిన చల్లుకుంటుంటే- "ఛ! ఇంకా ఈ రోజుల్లో ఈ పాద పూజలేవిటే సరసూ'' అన్నారు తెగ సిగ్గుపడిపోతూ.

"ఈ రోజులూ, ఆ రోజులూ అని ఏవిట్నాయనా! సూర్యుడు పడమట్న ఉదయిస్తున్నాడా? తూర్పున అస్తమిస్తున్నాడా? గ్రహాలు గతులు తప్పాయా? ఈ మాయదారి జనమే మారిపోతున్నారు. అయినా మాది పతివ్రతల వంశం. గ్రహాలు గతులు తప్పినా మా పద్ధతుల్ని మాత్రం మార్చుకోం!''అంటూ వచ్చింది బామ్మ.

"అవునండీ! నేను పతివ్రతని, మా అమ్మ మహా పతివ్రత, మా బామ్మ మహా మహా పతివ్రత. పతి పాదపూజ చెయ్యకుండా పచ్చిగంగ కూడా ముట్టం!'' అన్నాను గర్వంగా.

నిస్సహాయంగా చూశారాయన. మాతో వాదించి లాభం లేదనుకున్నారేమో! పాద పూజ చేయించుకుంటూనే వున్నారు. ఈ విషయం ఇరుగుపొరుగువాళ్ళకి తెలిసిందేమో! నన్ను పతివ్రతల జాబితాలో చేర్చేశారు. అంతేకాదు. నేను బైటకొస్తే దేవతని చూసినట్లు చూసేవారు.

మావారు మాత్రం- "నిన్నో పిచ్చిదాని కింద చూస్తున్నారంతా!'' అంటూ తెగ బాధ పడేవారు. అంతేకాదు నాలో మార్పు తేవాలని ప్రయత్నించి చిత్తుగా ఓడిపోయారు. ఓ నెల్లాళ్ళపాటుండి, నా కాపురం కన్నుల పండువుగా చూసి మా బామ్మ వెళ్ళిపోయింది. ఆవిడ వెళ్ళాక ఆయనగారి పోరు మరింత పెరిగింది.

"ఇన్ని నగలు ఇంట్లో వుండడం క్షేమం కాదు. లాకర్లో దాద్దాం!'' అన్నారు. "ప్రతివాళ్ళూ నిన్నో వింత జంతువు కింద చూస్తున్నారు. దయచేసి అందరిలా మామూలుగా వుండు'' అన్నారు.

"మీవన్నీ వుట్టి అనుమానాలు! ఇనప్పెట్టెలాంటి ఈ ఇంటికి దొంగెవడొస్తాడండీ! ఇంక నా నగల గురించి కామెంట్ చేసేవాళ్ళంటారా....అది కేవలం అసూయతో చేసిన కామెంట్, తప్ప మరోటి కాదు''అంటూ కొట్టి పారేశాను. ఏమనుకున్నారోగానీ ఇంక ఆ విషయాలు మాట్లాడ్డం మానేశారాయన. అయితే మునుపటి వుత్సాహం కనిపించడం లేదు. ఎప్పుడూ డల్‌గా వుంటున్నారు. కారణం అడిగితే చెప్పరు.

ఆ రోజు ఆఫీసు నుంచి కాస్త ఆలస్యంగా వచ్చారు. వస్తూనే మంచం మీద వాలిపోయారు. నేను కంగారుగా పలకరించబోతే- "కాస్త నన్ను ఒంటరిగా వదిలెయ్!'' అంటూ విసుక్కున్నారు. అయినా నేను వెళ్ళలేదు. అసలే నేను పతివ్రతనాయె!...అందుకే ఆయన కాళ్ళ దగ్గర కూర్చుని కాళ్ళు నొక్కసాగాను.

"సరసూ! నా కాళ్ళు నెప్పిగా లేవు. నువ్వెళ్ళు!''అన్నారు విసుగ్గా. నేను నవ్వాను.

"భలేవారే! కాళ్ళు నెప్పిగా వుంటేనేనా కాళ్ళు పట్టేది! పతివ్రత అయిన ప్రతి ఆడదీ ప్రతి రోజూ భర్త కాళ్ళు పట్టాలి. పాలకడలిలో లక్ష్మీదేవి చూడండి. ఎప్పుడూ భర్త కాళ్ళు పడుతూనే


అధిక శక్తి, ఆరోగ్యం.
తాజా తాజా పాలతో, ఎక్కడైనా... ఎప్పుడైనా

100% Good Milk

('ఎ' & 'డి' విటమిన్లు సమృద్ధివరచిన)




గుడ్ మిల్క్ (UHT పాలు) - విశాఖ డెయిరి వారి అత్యుత్తమ నాణ్యత కలిగిన పాలు. మీ కుటుంబానికి సరిపడా సంపూర్ణ శక్తి. మీ సంతోష సమయాలకు పాలు రెడీ !

- ఎప్పుడు కావాలంటే అప్పుడు పాలు సిద్ధం.
- ఫ్రిజ్‌లో ఉంచనవసరంలేదు
- కాచనవసరం లేదు.
- నాలుగు మాసాల పాటు తాజాదనం

విశాఖ డెయిరి
పాలు మరియు పాల పదార్థములు

విశాఖ కో-ఆపరేటివ్ డెయిరి
విశాఖపట్నం - 500 012.
Ph : 517230, 517181. Fax : 757708.

ప్రతి ప్యాక్‌లో సమతుల్య ఆహారం.

Abin Advtg

వుంటుంది!" అన్నాను మరింత గట్టిగా వత్తుతూ.

"హయ్యో! ఆ శ్రీమన్నారాయణుడికి ఏ షుగర్ కంప్లైంటో వుండి వుంటుంది. అందుకే ఇరవైనాలుగ్గంటలూ భార్య చేత కాళ్ళు పట్టించుకుంటుంటాడు కాబోలు. నాకలాంటివేం లేవు. నన్నొదిలెయ్ తల్లీ!"అన్నారు తల బాదుకుంటూ.

"హరి! హరి! ఎంత మాటన్నారు. ఆ శ్రీమన్నారాయణున్నే విమర్శిస్తున్నారా? ఎంత అపచారం!" అంటూ కనిపించని ఆ దైవానికి వంద క్షమాపణలు చెప్పుకున్నాను. ఆయన మరోసారి తలబాదుకుని కళ్ళు మూసుకున్నారు. ఏవిటో ఆయన మనస్తత్వం కొంచెం కూడా అర్థమై చావడం లేదు.

మర్నాడు ఎవరో రాధట. ఆయనగారి ఆఫీసులో పని చేస్తోందట. తీసుకొచ్చి పరిచయం చేశారు.

"కంగ్రాట్స్ సరసు గారూ! మీ పెళ్ళికి రాలేకపోయాం. తర్వాత మా మావగారి ఆరోగ్యం బావుండక వూరెళ్ళి నిన్ననే వచ్చాం. ఇన్నాళ్టికి మిమ్మల్ని చూసే భాగ్యం కలిగింది!" అంటూ గలగల మాట్లాడేసింది ఆ రాధ అన్నామె.

ఆవిడకేసి అలా చూస్తుండిపోయాను. నిజానికి ఆవిడ చాలా అందంగా వుంది. అయితే పాపం ఒంటిమీద నగలేం పెద్దగా లేవు ఓ జత గాజులు, మెళ్ళో చైను తప్ప. చీర కూడా పెద్ద ఖరీదైందేం కాదు. నేనేదో అనబోతుండగానే ఆమె భర్త నమస్కరించాడు. అంతవరకూ ఆయన్ని గమనించని నేను గభాల్న ఇంట్లోకెళ్ళిపోయాను. మావారెంత బతిమాలినా "పరాయి మగాడి ఎదుటికి రాను గాక రాను" అన్నాను. కాఫీ కలిపి మావారికిచ్చే పంపాను.

"ఇదిరా నా జీవితం!" అని బాధగా ఆయన అనడం నాకు వినిపించింది. అయితే మాత్రం పరాయిమగాడి ఎదురుగా నిలువడమా! ఛ! అసలే మాది పతివ్రతల వంశం...కాస్సేపుండి వాళ్ళు వెళ్ళిపోయారు.

తర్వాత నన్నాయన కాస్త గట్టిగానే మందలించారు. మూర్తి ఎంత మంచివాడో, రాధ అతనికి ఎంత తగిన ఇల్లాలో చెప్పారు. రాధని చూసి నేర్చుకో బాగుపడతావు అన్నారు. ఇంకా చాలా అన్నారు. నేను మారు మాట్లాడలేదు. ఎలా మాట్లాడతానండీ! నేను పతివ్రతని కదా!

అయితే క్రమేపీ ఆయన నాతో ముభావంగా వుండడం మొదలు పెట్టారు. ప్రతి చిన్న విషయానికీ విసుక్కోసాగారు. అయినా నేను పతివ్రతని కనుక అవేం పట్టించుకోకుండా, ఏ మాత్రం విసుక్కోకుండా పాద పూజ దగ్గర్నుంచీ అన్ని సపర్యలూ చేస్తున్నాను. ఒక్కటి మాత్రం నన్ను గాయపరుస్తోంది. అది ఆయన రాధని పదే పదే పొగడ్డం. మరి పరాయి ఆడదాన్ని భార్య దగ్గర అంతగా పొగుడుతుంటే ఎవరికి మాత్రం బాధగా వుండదు చెప్పండి!...అయినా నోరు మెదపలేదు.

కాలం గడుస్తోంది. గడవదు మరీ!... ఈ మనుషుల్లా కాలగమనంలో మార్పులొస్తాయా?... సీతాకాలం వచ్చింది. చలి ఒకటే వణికించేస్తోంది. అంత చలిలో చల్లటి నీళ్ళతో ఆయనగారి కాళ్ళు కడిగితే మరింత ఒణికి పోతారని వేడి నీళ్ళతో కడిగాను. అంతే ఆయన ఇల్లదిరేలా కేకలు పెట్టి చిందులు వేశారు. నీళ్ళు మసిలి పోతున్నాయని, కాస్త వేడిగా వున్న మాట నిజమేగానీ మరీ ఆయనన్నట్లు మసిలి పోయేలా యేం లేవు. నేను నవ్వి "ఈ మాత్రానికే పసివాడిలా అంత హడావుడి చేస్తారేవిటండీ! సీతాకాలంలో మా బామ్మ మా తాతయ్య కాళ్ళు ఎసట్లో నీళ్ళెట్టి కడిగేదట!"అన్నాను ఎర్రబడిపోయిన ఆయన పాదాలని నా పైట చెంగుతో అద్దుతూ.

"అవును. అందుకే ఆయన ముప్పయేళ్ళు నిండకుండానే జీవితం మీద విరక్తి పుట్టి సన్యాసుల్లో కలిసిపోయాడు!" అన్నారు కాళ్ళని వూదుకుంటూ. నాక్కోపం వచ్చింది.

"మా తాతయ్య సన్యాసుల్లో కలిసింది అందుక్కాదు. ఆయన కల్లో వెంకన్న బాబు కనిపించి..."

"ఇక ఆ సొద ఆపి కాళ్ళకి కాస్త బర్నాలు రాయి!"అంటూ కస్సుమన్నారు నా మాటలు వినిపించుకోకుండానే. నేను భారంగా నిట్టూర్చి కాళ్ళకి బర్నాలు తెచ్చి రాశాను. ఏమాటకామాటే చెప్పాలి. పాపం! ఆయన పాదాలు కందిపోయాయి.

"ఛ! ఇకనించి గోరు వెచ్చని నీళ్ళతోనే కడగాలి!" అని గట్టిగా నిర్ణయించుకున్నాను. అయితే నాకో కొత్త బెడద వచ్చి పడింది. నాల్రోజులకోసారి ఆ రాధ మా ఇంటికి రావడం, నాతో ఏవేవో సుత్తి కబుర్లు చెప్పడం మొదలు పెట్టేది. ఆవిడగారు ఆయనకోసం వస్తుందేమో అనుకున్నాను. అయితే ఆయన వున్నప్పుడు ఎప్పుడూ రాలేదు. అంతేకాదు నా ప్రవర్తనలో మార్పు తేవడానికి తాపత్రయపడుతోందని తర్వాత గ్రహించాను. నేను చిరాకు పడిపోయాను.

"చూడండి! మాది పతివ్రతల వంశం. నేను పతివ్రతని. మా అమ్మ మహా పతివ్రత, మా బామ్మ..."

"మహా మహా పతివ్రత!...అదంతా నాకు తెలుసు. కానీ ఒకటి చెప్పండి. అసలు 'పతివ్రత' అంటే అర్థం తెలుసా మీకు?" అని నవ్వుతూ నా మాటకి ఆనకట్టవేసింది రాధ.

ఈ మాటతో నాకు మరీ కోపం వచ్చింది. "ఏవిటీ పతివ్రత అంటే అర్థం తెలుసా అంటారా? ఇదిగో చూడండీ! సీతాదేవి మాకులదైవం. సతీసుమతి మా ఆదర్శం...సతీ సావిత్రి మా ఇష్ట దేవత...అసలు పతివ్రతల నిలయమే మా ఇల్లు!" అన్నాను గర్వంగా, పతివ్రతా లక్షణాలు చెప్తూ...ఆవిడ నవ్వింది.

"చూడండి సరసూ! పాతివ్రత్యం అంటే మంగళసూత్రాలు కళ్ళకద్దుకుని చారెడు పసుపు మొహానికి రాసుకుని, పావలా కాసంత బొట్టు పెట్టుకుని, కాఫీ కావాలి, ఈ పాద పూజలు వద్దు మొర్రో అంటున్న భర్తని బలవంతంగా కూలేసి పాదపూజ చెయ్యడం కాదు. ఆకలో రామచంద్రా అంటూ అల్లాడుతున్న భర్తని మాడుస్తూ దేవుడిగదిలో కూర్చుని శ్లోకాలు వల్లెవెయ్యడం కాదండీ! భర్త ఇష్టాలేవిటో తెలుసుకోవాలి. అతని ఇష్టానుసారంగా ప్రవర్తించాలి ఆదా! అలా అని మీ నగలూ అవీ తీసెయ్యమనిగానీ, బరితెగించినట్టుండమనీ కాదు. వాళ్ళ ఆనందమే మన ఆనందంగా భావించాలి"అంది అనునయంగా.

"అంటే ఇవేం నేను చెయ్యడం లేదంటారా! ఆయన్ని నేను ప్రాణంలా చూసుకుంటున్నాను!" అన్నాను రుసరుసలాడుతూ.

"అని మీరనుకుంటున్నారు. కానీ మీ చర్యల వల్ల ఆయన చాలా వర్రీ అవుతున్నారు. మీరు నలుగురిలా సింపుల్‌గా వుంటూ, తనతో సినిమాలకీ, షికార్లకీ రావాలని ఆశపడుతున్నారు. నలుగురితో కలివిడిగా తిరగాలని కోరుకుంటున్నారు. ఆయన మాకు చాలా కాలంగా తెలుసు. ఉత్సాహానికి మారు పేరులా వుండేవారు. ఇన్ని పురాణగాథలు తెలిసిన మీకు ఈ మాత్రం తెలియదూ?...సతీ సుమతి మీ ఆదర్శం అని మీరే అన్నారుగా?

చూడండి సరసూ! కాలం మారింది. కాలంతో పాటు మనమూ మారాలి. ఇది పురాణ యుగం కాదు. నీతి నియమాలతో బతికే ప్రతి వారూ మహానుభావులే. అందుకే నా మాట విని...మీరు మీ వారిని సంతోషపరచడానికి ప్రయత్నించండి! మీరు నా చెల్లెల్లాంటి వారు. అందుకే ఆఫీసులో పర్మిషన్ పెట్టి మరీ వచ్చి చెప్తున్నాను!" అంది రాధ నా భుజం మీద చెయ్యి వేసి నిమురుతూ.

నేను ఆలోచనలో పడ్డాను. ఆవిడ మాటలకి ముందు కోపం వచ్చినా, తర్వాత ఆవిడ మాటల్లో నిజం వుందని గ్రహించాను.

"ఆయనకిష్టమైన పన్లు చేస్తే ఆయన ఆనందంగా వుంటారా?" అన్నాను ఆశగా.

"తప్పకుండా!" అంది రాధ వుత్సాహంగా. తర్వాత నాకింకా చాలా విషయాలు చెప్పింది. అవి విన్నాక ఆవిణ్ణి మెచ్చుకోకుండా వుండలేకపోయాను. "నిజంగా మీరు పతివ్రత కాకపోయినా మీకు చాలా విషయాలు తెలుసండీ!" అన్నాను మురిసిపోతూ. అయితే నా మాటలకావిడ పొంగిపోలేదు. సరికదా చేదుతిన్నట్టు మొహం పెట్టి- "దయచేసి ఆ పతివ్రత అన్న మాట వదిలెయ్యండి సరసూ!" అంది క్లుప్తంగా.

"అదేవిటండీ! అసలే మాది పతివ్రతల వంశం.

నేను పతివ్రతని, మా అమ్మ మహా పతివ్రత, మా ..."

"సరి సరి! నేనొస్తాను! నేను చెప్పినవి మాత్రం మర్చిపోకండి!" అంటూ నా మాట పూర్తిగా వినకుండానే ఎవరో తరుముతున్నట్టు పారిపోయింది రాధ. నేను మాత్రం ఆయనరాకకోసం ఆత్రుతగా ఎదురు చూస్తూ కూర్చున్నాను.

ఆ రోజు ఆయనొచ్చేసరికి బాగా పొద్దుపోయింది. వస్తూనే మౌనంగా గదిలోకెళ్ళి పడుకున్నారు. నేను వెళ్ళి- "ఏవండీ! ఇక నుంచీ మీకిష్టమైన పన్లు చేస్తానండీ!"అంటూ రాధ రావడం, మాట్లాడ్డం అన్నీ చెప్పాను. అంతే! ఆయన మొహం వెలిగిపోయింది.



"నిజంగానా!" అన్నారు నన్ను పొదివి పట్టుకుని.

"చూస్తారుగా" అంటూ ఆయన్ని దేవుడిగదిలోకి లాక్కొచ్చి చేతులుజోడించి భక్తిగా కళ్ళు మూసుకున్నాను. ఎంతసేపటికీ నేను కళ్ళు తెరవకపోవడంతో- "ఇంత సేపు ఏం కోరుకున్నావు సరసూ!" అన్నారాయన గోముగా.

"మీకు కుష్టురోగం రావాలని!"తకీమని అన్నాను.

బిగుసుకు పోయారాయన.

"అవునండీ! సతీసుమతి మా ఆదర్శ దేవత అని మీకు తెలుసుగా! ఆవిడేం చేసింది? కుష్టు మొగుణ్ణి బుట్టలో పెట్టుకుని వేశ్య దగ్గరికి తీసికెళ్ళింది. మీకు ఆ రాధంటే ఇష్టం. అందుకే మీకు కుష్టు రోగం రావాలి. అప్పుడు మీరు రాధని కోరాలి. నేను వెంటనే మిమ్మల్ని బుట్టలో కూర్చోపెట్టుకుని ఆవిడ దగ్గరికి తీసికెళ్ళాలి. అవునూ...అంత పెద్ద బుట్ట దొరుకుతుందా? పోనీ దొరికింది అనుకుందాం...కానీ అందులో మిమ్మల్ని మొయ్యగలనా?" అన్నాను ఏదో ఆలోచిస్తూ.

అంతే! ఏమైందో ఏమోగానీ ఆయనగారు ఓసారి పిచ్చిగా చూసి తర్వాత బట్టలన్నీ చించుకుని, జుట్టు పీక్కుంటూ వీధిలోకి పరిగెత్తారు. నాకు దుఃఖం వచ్చింది. "ఇంక నేను కాళ్ళెవరికి కడగనూ? పాద పూజలెవరికి చెయ్యను? పతివ్రత కథలు ఎవరికి చెప్పను?" అంటూ కుళ్ళి కుళ్ళి ఏడ్చాను.

వారం రోజులైంది గానీ ఆయన జాడలేదు. బామ్మకి ఫోన్ చేద్దామనుకున్నానుగానీ, నా పతి సేవలో ఏదో లోపం వచ్చిందని బామ్మ ఎక్కడ తిడుతుందోనని చెయ్యలేదు.

ఆయన గురించి తెలియక పోవడంతో ఎలాగో రాధ ఇల్లు తెలుసుకుని వెళ్ళి విషయం చెప్పాను. ఆవిడ జాలి పళ్ళేదు సరికదా-

"ఆయన ఆఫీసుక్కూడా రావడం లేదు. చేసిందానికి అనుభవించండి!" అంది విసురుగా. నేను బిత్తరపోయాను. తర్వాత ఏడుస్తూ ఆయన జాడ తెలుసుకోమని బతిమాలాను.

## తంతా!

*దియామీర్జా సల్మాన్‌తో కలిసి ఒక సినిమాలో నటించింది. అంతే! సల్మాన్‌తో లింకు పెట్టేశారు. రబ్బిష్! నేను కొత్తమ్మాయిని నా వర్క్ మీద నన్ను కాన్‌సంట్రేట్ చేసుకోనివ్వండి. ఇంత వరకూ నా జీవితంలో ఏ మగాడూ ప్రవేశించలేదు. ప్రవేశించనివ్వను అంటోంది దియామీర్జా. ఇక ముందు ఇలాంటి పుకార్లు పుట్టించారో నేనే స్వయంగా వచ్చి తంతా! అంటోంది. (పుచ్చుకాయల దొంగంటే భుజాలు తడుముకోవడం అంటే ఇలాగే వుంటుంది.)*

"తెలుసుకున్నా లాభం లేదు. ఆయనకి పూర్తిగా మతి చలించి ప్రస్తుతం పిచ్చాసుపత్రిలో వున్నారు!" అన్నాడు రాధ భర్త మూర్తిగారు. నా పై ప్రాణాలు పైనే పోయాయి. అప్పుడు ఆయన ఓ పరాయి మగాడిలా అనిపించలేదు. ఓ అన్నలా అనిపించి కాళ్ళంటి వేడుకున్నాను ఆయన్ని చూపించమని. తర్వాత వాళ్ళు నన్ను ఆయన దగ్గరికి తీసికెళ్ళారు. ఆయన్ని చూడగానే ఒణికి పోయాను.

గడ్డం పెరిగిపోయింది. కళ్ళు గుంటలు పడిపోయాయి. బట్టలు చిరిగిపోయాయి. "బాబోయ్! నాకు పెళ్ళాం వద్దు! పతివ్రతలు అసలొద్దు!" అంటూ ఏదేదో మాట్లాడుతున్నారు ఏడుస్తూ, నవ్వుతూ.

నా శరీరంలోని రక్తమంతా నీరయిపోయినట్టయింది. "ఇంక మిమ్మల్ని బాధ పెట్టను!"అంటూ బ్రతిమాలి డాక్టర్ల కాళ్ళు పట్టుకుని రాధ, మూర్తిగార్ల సాయంతో ఇల్లు చేర్చాను. ఇంటికొచ్చిన ఆయన ధోరణిలో మార్పు లేదు. రాధ వాళ్ళు దగ్గరుండి ధైర్యం చెప్తున్నారు. ఎందుకో వాళ్ళు నాకు చాలా ఆత్మీయుల్లా కనిపిస్తున్నారు. అందుకే ఆయనగారి పాదపూజ మాత్రం వాయిదా వేశాను. నా నగల్ని, పట్టు చీరల్ని రాధ వింతగా చూస్తున్నా నేను పెద్దగా పట్టించుకోలేదు.

ఆరోజు వుదయం మూర్తిగారు ఆయనకి మందు తాగిస్తున్నారు. రాధ పళ్ళరసం తీస్తోంది. నేను నా గదిలోకెళ్ళి అరగంట తర్వాత బైటికొచ్చాను. నన్ను చూసి ప్రతిమలా అయిపోయారు రాధ, ఆమె భర్త. కారణం నేను రాధలా మామూలు అలంకరణలో వుడడంమే.

"సరసూ...మీరు!"అంది రాధ విస్మయంగా.

"నేను నేనే! మీలాగే ఓ సాధారణ ఇల్లాలిని. పతివ్రత అంటే అర్థం కూడా తెలియని మూర్ఖురాలిని. సుద్ద పల్లెటూళ్ళో పుట్టడం, అతి చాదస్తపు కుటుంబంలో పుట్టి పెరగడంతో...పిచ్చి ప్రవర్తనతో ఆయన్నే కాక మీ అందర్నీ కూడా బాధ పెట్టాను. ఇదిగో ఈ రాధగారి వల్ల జ్ఞానోదయం అయింది!"అన్నాను కంట్లో పూరిన నీటిని కొన గోటితో తుడుచుకుంటూ.

రాధ దంపతులు పొంగిపోయారు.

"ఇంక మీరూ కళ్ళు తెరవండి సర్! ఇంక పొరపాటున కూడా పాదపూజలంటూ ప్రాణం తియ్యను! మీతో పాటు ఎంచక్కా సినిమాలకీ, షికార్లకీ హేపీగా వస్తాను!" అన్నాను ఆయనకేసి ముసిముసిగా నవ్వుతూ.

ఆయన బిత్తరపోతూ లేచికూర్చున్నారు. "ఏవిటి...ఎవర్నువ్వు?"అంటూ పిచ్చిగా మాట్లాడబోయారు.

"ఇంక మీ నటన చాలు! మీ పిచ్చి అంతా డ్రామా అని నాకు తెలిసిపోయింది. ఆ మెంటల్ హాస్పిటల్ డాక్టర్ మీ ఫ్రెండ్‌నికూడా తెలుసు. దయచేసి నా అజ్ఞానానికి మన్నించండి. ఇంక నాలో కొత్త సరసుని చూస్తారు!" అన్నాను మనస్ఫూర్తిగా.

"మరి...మీ బామ్మ వచ్చి చెప్తే!"

"బామ్మే కాదు. ఆ దేవుడే దిగి వచ్చి చెప్పినా నేను మారను! అన్నాను దృఢంగా.

"అయ్య బాబోయ్! నా పతివ్రత నిజంగానే మారిపోయింది. ఒరేయ్ మూర్తీ...ఇవాళ హేపీగా హోటల్లో భోంచేసి, ఏదైనా సినిమాకెళ్దాంరా!" అన్నారాయన వుత్సాహంగా.

"ఊఁ...హూ! ఒద్దు!" అన్నాను గంభీరంగా

తృళ్ళిపడి కంగారుగా చూశారంతా

"నేను చక్కగా వంట చేస్తాను. హాయిగా కబుర్లు చెప్పుకుంటూ ఇక్కడే భోంచేసి, తర్వాత మీకు నచ్చిన సినిమాకి వెళ్దాం!" అన్నాను నవ్వేస్తూ.

"వెరీ గుడ్ అయిడియా!" ఆనందంగా చప్పట్లు కొట్టింది రాధ. మా వారి మొహంలో వేయి పున్నముల కాంతి.

"ఇంత చక్కని కాంతినా ఇన్నాళ్ళూ నా మూర్ఖత్వంతో దూరం చేసుకున్నది" అనుకుంటే నా కళ్ళు శ్రావణ మేఘాలయ్యాయి. అన్నట్టుగానే ఆ రోజు హాయిగా గడిపేశాం అంతా కలిసి.

అంతేకాదు. మళ్ళీ ఎప్పుడూ నా నోటంట పతివ్రత అన్న మాటగానీ, పతివ్రతల వంశం అన్న మాటగానీ రాలేదు. రాదు కూడా. ఒట్టు! ❋